త్రైలోక్యగీత - అష్టమ అధ్యాయము
మద మాత్సర్య యోగము

త్రైలోక్యా ఉవాచ:-

బ్రహ్మ జ్ఞాన పరబ్రహ్మన్, నాన్యస్త్వత్తో గురుర్భువి |
అసూయా చాప్యహంకారః, కీదృశౌ? నిగ్రహః కథమ్?||8.1||

[కుమారి త్రైలోక్య అడిగింది: -
ఆధ్యాత్మిక జ్ఞాన స్వరూపమైన ఓ అనూహ్య పరబ్రహ్మమా! ఈ భూమి మీద ఆధ్యాత్మిక జ్ఞానములోని భావనలను మీ వలె బోధించగల గురువులనెవరినీ నేను చూడలేదు. ఈర్ష్య మరియు అహంకారములు అంటే ఏమిటి? వాటిని ఎలా నియంత్రించాలి?]

శ్రీ శ్రీ శ్రీ దత్తస్వామీ ఉవాచ:-

మదమాత్సర్య నిర్ముక్తే!, సమైక్యా జ్యేష్ఠ సోదరి! |
త్రైలోక్యే! శృణు తౌ జ్ఞాన–భక్త్య ర్కేందు తమోగ్రహౌ ||8.2||

[శ్రీశ్రీశ్రీ దత్తస్వామి వచించారు :-
ఓ త్రైలోక్య! సమైక్యకు జ్యేష్ఠ సోదరి! ఈర్ష్య, అహంకారముల నుండి పూర్తిగా విముక్తి పొందిన శ్రేష్ఠ జీవాత్మవు. ఈర్ష్య, అహంకారములు సూర్యుని వంటి జ్ఞానమును, చంద్రుని వంటి భక్తిని మ్రింగి వేసెడి రెండు చీకటి గ్రహముల (రాహు మరియు కేతువు) వంటివి.]

సన్ముఖా భగవత్సృష్టాః, సదసత్ వదనా గుణాః |
అసన్ముఖాః కృతా జీవైః, పూర్ణ దుర్గుణ విశ్రుతాః ||8.3||

[భగవంతుడు చెడు స్వభావములను సృష్టించెనని, వాటి వలన మనకు ఆధ్యాత్మిక జీవితంలో మరియు ప్రాపంచిక జీవితంలో అనేక అవరోధాలు కలుగుతున్నాయని భావించి నింద మొత్తం భగవంతుని మీద వేయరాదు. నిజానికి ప్రతి స్వభావమునకు మంచి, చెడు అను రెండు పరస్పర వ్యతిరేక కోణాలు ఉంటాయి. భగవంతుడు సృష్టించినపుడు ప్రతి స్వభావమును మంచి కోణములోనే సృష్టించాడు, నిజానికి భగవంతుడు సృష్టించిన ప్రతి స్వభావము సంపూర్ణంగా శ్రేష్ఠమైనది. జీవాత్మలు ఈ స్వభావముల దారి మళ్ళించి వాటి చెడుకోణములు కనిపించునట్లు చూపించారు. ఆ విధంగా ప్రతి స్వభావము చెడ్డ స్వభావముగా జీవుల చేత ముద్ర వేయబడినది.]

ఆత్మఖ్యాతి రహంకారః, సేవా ద్వైతాత్ మహాన్ ఖలః |
స్పర్ధావృద్ధే రసూయా సత్, పర హానౌ తు సా న సత్ ||8.4||

[ఆ ప్రాథమిక అహంకారమునకు గల మంచి, చెడు కోణములు విచారిస్తే, నిన్ను నీవు గుర్తించుటకు మరియు భగవత్సేవ చేయుటకు నిలబడ గలగే విశ్వాసమును ఇచ్చుటకు, జీవుడు వేరు దేవుడు వేరు అనెడి ప్రాథమిక ప్రమాణమును బలపరచుటకు అహంకారం యొక్క మంచి కోణము ఉపకరిస్తున్నది. ఈ అహంకారము హద్దు మీరితే, చెడు స్వభావం

అయిన గర్వంగా మారుతున్నది. అసూయకు గల మంచికోణము ఏమిటంటే జీవాత్మ తనను తాను వృద్ధిపరచు కొను సాధనముగా పనిచేయడము. కాని అదే అసూయ మరొకరిని బాధించే సాధనంగా వాడితే అది చెడు స్వభావంగా ఎంచబడుతుంది. ఉదాహరణకు, బాగా చదివి ఎక్కువ మార్కులు సాధించిన ఒక మెరిట్ విద్యార్థిని చూసి తను అతని కన్నా బాగా శ్రమించి చదివి, ఆ మెరిట్ విద్యార్థి కన్నా ఎక్కువ మార్కులు సాధిస్తే అది మంచికోణము. కాని పరీక్షాసమయం దగ్గర పడగానే ఆ మెరిట్ విద్యార్థిని కొట్టి అతని ప్రగతిని (తన కంటే) తగ్గించాలనే ఆలోచన చెడ్డది.]

అవతారే తు సర్వేఽపి, భక్తే భక్తో నరో నరే |
సర్వత్ర దృశ్యతే బాధా, విద్యుత్ దుఃఖవదత్ర హి ||8.5||

[ప్రతి ఒక్కరికీ వర్తమాన నరావతారము పట్ల అహంకార పూరితమైన ఈర్ష్య కలుగుతుంది, ఎందుకంటే నరావతారము సర్వోత్కృష్టమైనదై సర్వత్ర పూజింప బడతుంది. ఇదే అహంకార పూరిత ఈర్ష్య ప్రతి ఇద్దరు భక్తుల మధ్య కూడా కలుగుతుంది. కావున ప్రతి మనిషికీ మరొక మనిషి పట్ల అహంకార పూరిత ఈర్ష్య ఉంటుంది. ప్రతి చోట ఈ రెండు గుణములు చెడు ముఖములతో వాడబడి చెడు ఫలితములకు దారి తీసి మనోవ్యాకులత కలిగించును. తనను మించిన స్థితి ఒక సాధారణ వ్యక్తిలో అహంకార పూరిత ఈర్ష్య కలిగిస్తుందనుటకు చక్కని ఉదాహరణ, మనం మన ఇంట్లో విద్యుత్తు సరఫరా ఆగిపోయి, పొరుగువారి ఇంట్లో గనక విద్యుత్ సరఫరా ఉన్నట్లు కనిపిస్తే మన గుండె మండుట ఆరంభిస్తుంది.]

సహ్యస్తరతమో భేదః, నైవ భక్తో నరోఽథ వా |
బాధోన్నతతరే సహ్య, న తూన్నతతమే కథమ్ ||8.6||

[కావున ప్రాపంచిక జీవితం (ప్రవృత్తి)లో సాధారణ మానవులు తమ పొరుగువారి గొప్ప స్థితిని సహించలేరు. అలాగే ఆధ్యాత్మిక జీవితం (నివృత్తి)లో సాధకులు తమ కంటే గొప్ప సాధకుని స్థితిని సహించలేరు. తమతో పోల్చిన తోటివాని గొప్పస్థితిని సహించలేని మానవులు లేదా సాధకులు, తమతో పోల్చడానికే వీలుకాని పరమోత్కృష్టమైన నరావతారము యొక్క స్థితిని ఎలా సహించగలరు?]

అహంతా త్రివిధా నాత్రేః, నాసూయా మాతురస్య చ |
తాభ్యాం ముక్తేన దత్తోఽయం, లభతే హీతి నిశ్చితమ్ ||8.7||.

[సాత్త్వికి అహంకారం, రాజసిక అహంకారం, మరియు తామసిక అహంకారం అను మూడు విధములైన అహంకారాలు లేని ఋషియే అత్రి అని అర్థము. (సాత్త్విక అహంకారం - జ్ఞానం వలన కలిగేది, రాజసిక అహంకారం - శక్తి, అధికారముల వలన కలిగేది మరియు తామసిక అహంకారం - భౌతిక సంపదల వలన కలిగేది). అనసూయ అంటే అసూయ లేని జీవాత్మ. అత్రి మరియు అనసూయ దంపతులకు దత్త భగవానుడు తనను తాను దత్తం చేసుకున్నాడు. దీని అంతరార్థం ఏమిటంటే అసూయ, అహంకారములు లేని జీవాత్మల చేత దత్తుడు పొందబడతాడు.]

దైవస్య సద్గుణాస్సర్వే, దోషా జీవస్య సర్వదా|
ఇతి తృప్తో భవేత్కోఽపి, దారిద్ర్యే విలపేన్న హి ||8.8||

[అసూయ, అహంకారములను నియంత్రించాలంటే వాటి నేపథ్యమును అర్థం చేసుకోవాలి. మన కంటే ఎక్కువ ఉత్తమ గుణములు కలిగి ఉన్న వారి పట్ల మనకు అసూయ, అహంకారములు కలుగుతాయి. దీని వెనకనున్న సంగతి ఏమిటంటే మనం ఆ ఉత్తమ గుణములు ఆ జీవాత్మ కలిగి ఉన్నాడని భావిస్తున్నాము. మనలో అసూయ కలిగించగల ఉత్తమ గుణములు ఏవైనా అవి కేవలం పరమాత్మకు సంబంధించినవి మాత్రమే కాని జీవాత్మవి కాదు అని గనక మనం భావించినట్లైతే, తోటివాని గుణముల పట్ల అసూయ చెందనవసరం లేదు. పోతే, తోటివారి నిమ్నగుణముల గురించి మనం చింతించనవసరం లేదు, ఎందువలన అంటే అథమగుణాల పట్ల మనం ఎలాగూ అసూయ చెందము. నిజానికి అథమగుణాలన్నీ జీవాత్మలకు చెందినవే. కాని ఒక పేదవానిని చూసి 'అయ్యో ! నేను వానిలా పేదవానిగా లేనే' అని బాధపడేవారెవ్వరూ ఉండరు గదా!]

నింద్య శ్రేష్ఠ ఫలాన్నైవ, కర్మ తత్తత్ఫలప్రదమ్ |
దైవం కర్మా నుసరతి, పక్షపాతో న హి క్వచిత్ ||8.9||

[ఏదైనా జీవాత్మ అందంలో ఘనుడు, లేదా జ్ఞానంలో ఘనుడు, సంపదలో ఘనుడు అయితే వానికి భగవంతుడిచ్చిన ఆ ఘనతను చూసి మనం ఏడవనవసరం లేదు. జీవులు చేసే పాపపుణ్య కర్మలను బట్టి భగవంతుడు వారికి తగిన ఫలములను అందిస్తాడు కావున భగవంతుని తీర్పును గాని, జీవాత్మ కర్మలను గాని తప్పుపట్టలేము. ఒకవేళ మనం పుణ్య కర్మలు చేసి ఉంటే కచ్చితంగా భగవంతుడు మనకు కూడా నిష్పక్షపాతంగా ఘనమైన ఫలితాలనే ఇచ్చేస్తాడు. ఈ విధంగా మనం భగవంతుని యందు గాని జీవాత్మ యందు గాని ఏ విధమైన తప్పును ఆరోపించలేము. 'కర్మ- ఫలముల సిద్ధాంతముల' నియమాలను అనుసరించక భగవంతుడేమీ అహేతుకంగానో, పక్షపాతంతోనో ప్రవర్తించుట లేదు.]

బాధాకర్మణి చ ఫలే, యది భావిఫలం న తే |
అలాభేఽపి నాన్య లాభః, స్వనాశేఽపి పర వ్యయః ||8.10||

[తోటి వాడు పుణ్య కర్మలు చేసి ఉత్తమ ఫలములు పొందడం చూసి ఒక జీవాత్మ అసూయ అహంకారాల బారినపడి క్షోభ అనుభవిస్తున్నట్లయితే ఈ క్షోభకు కారణం, తోటివాడు పుణ్య కర్మ చేయకూడదనా? లేక చేసిన పుణ్య కర్మకు తగిన శుభఫలితం పొందకూడదనా? ఒకవేళ వాని ఏడుపును భగవంతుడు తీరిస్తే, రేపటినాడు ఈ జీవాత్మ చేసిన పుణ్య కర్మలకు ఉత్తమ ఫలితమును పొందడానికి వాని కొరకు ఇచ్చిన తీర్పే అడ్డుకాగలదు. కొందరు జీవాత్మలు, పుణ్య ఫలితములు వారికి రాకపోయినా పరవాలేదు కాని తోటివారికి మాత్రం ఉత్తమ ఫలితములు పొందకూడదని కోరతారు. ఇంకా కొందరు జీవాత్మలు ఎదుటివారికి నష్టము కలిగే అవకాశం ఉంటే చాలు, అందుకు అవసరమైతే దానికి సమానమైన నష్టం తాము కూడా పొందడానికి కూడా సిద్ధమైపోతారు.]

అవతారే యదా శంకా, స్వర్ణతామ్రవదద్వయే |
అణు ద్వైతమివాలోక్యం, తామ్రస్య స్యాత్ పృథగ్గుణః||8.11||

[నరావతారము యొక్క ఉత్కృష్టత పట్ల నీవు అసూయ పెంచుకున్నావంటే, దాని తార్కిక అంతరార్థము, దత్త భగవానుడు వర్తమాన మానవ శరీరంలో సంపూర్ణముగా విలీనమై ఒక్కటైనాడని నీవింకా నమ్మట లేదు. నిజరూప దత్తుడైన అనూహ్య పరమాత్మ మరియు దత్తుడు విలీనమైన మానవ శరీరునకు మధ్య సూక్ష్మఅంతరమును చూస్తున్నావు అంటే నరావతారునిలో నీవు ద్వైతాన్ని చూస్తున్నావు. దీనికి ఉదాహరణ ఏమిటంటే, స్వచ్ఛమైన బంగారు లోహమునకు పలుచని పలకలుగా మారగల స్వభావం (స్తరణీయత), తీగలుగా మారగల స్వభావం (తాంతవత), రాగి అను లోహంతో కలిస్తేనే వస్తుంది. ఈ రెండు స్వభావములు రాగికి సంబంధించినవి మాత్రమే. రాగిలోహంతో కలిసిన మీదట కూడా బంగారం స్వచ్ఛంగానే కనిపించును. ఇలాగే ఉత్తమ గుణములు స్వచ్ఛమైన నరునకు సంబంధించినవని భావింపబడుతుంది. కాని నిజానికి ఉత్తమ స్వభావములు నరావతారమునకు అనగా దత్తునకు సంబంధించినవి. ఉత్తమ భక్తుడైన నరుని (బంగారం)లో ఉన్న దత్తుడు (రాగి) వల్లనే యీ ప్రత్యేక గుణములు వచ్చినవి. ఈ నిజం తెలిసాక నీవు నరావతారములో విలీనమైన దత్త భగవానుని పట్ల అసూయ చెందవు కదా. నరావతారము యొక్క స్వచ్ఛమైన నరుని (స్వచ్ఛమైన బంగారం) పట్ల అసూయ పడనవసరం లేదు, ఎందుకంటే (తాంతవత, స్తరణీయత అను స్వభావములు రాగికి చెందిన లక్షణములు) ఉత్తమ స్వభావములు అనూహ్య పరమాత్మవే కాని బంగారానివి (స్వచ్ఛమైన నరుడు) కావు. కావున నీవు అసూయ చెందడం వ్యర్థం. నరావతారము అంటే స్వచ్ఛమైన నరునిలో అనూహ్య పరమాత్మ విలీనమైన రూపం. కాని బాహ్య రూపం చూసి భ్రమతో నీవు స్వచ్ఛమైన నరునిగా మాత్రమే భావిస్తున్నావు. ఎలాగంటే రాగితో కలిసిన బంగారం స్వచ్ఛమైన బంగారం లాగానే కనిపిస్తుంది. కాని పరిశోధిస్తే అందులో బంగారం అణువులు వేరుగా రాగి అణువులు వేర్వేరుగానే ఉంటాయి. ఉత్తమ స్వభావములు (తాంతవత, స్తరణీయత) నరావతారంలో విలీనమైన అనూహ్య పరమాత్మకు సంబంధించినవే అయినా నీవు అవన్నీ నరుని లక్షణాలుగా చూస్తున్నావు. (రాగి లక్షణాలైన తాంతవత, స్తరణీయతలను బంగారం లక్షణాలుగా చూస్తున్నావు). ఇక్కడ నీవు అసూయ చెంద వలసిన అవసరమే లేదు, ఎందువలన అంటే ఉత్తమ స్వభావములన్నీ దత్త భగవానునివే గాని
శరీర మాధ్యమమైన శుద్ధనరునివి కావు. ఈ దృష్టాంతములో స్తరణీయత, తాంతవత అను మంచి లక్షణములు రాగికి ఉండుట చేత రాగిని భగవంతునిగాను, మంచి జీవుని బంగారముగాను తీసుకొనవలసి వచ్చినది. మరొక విశేషమేమంటే రాగి (భగవంతుడు) కలిసిన బంగారము (భక్తజీవుడు) బంగారము లాగానే (జీవునిగానే) కనిపిస్తాడు. ఇచ్చట లోహముల విలువలను నిర్లక్ష్యము చేయవలయును.]

అవతారో యదా దృష్టః, నోహ్యాలీన స్స కేవలః |
సద్గుణా స్తస్య దత్తస్య, న ద్వితీయస్య కా విపత్? ||8.12||

[వర్తమాన నరావతారము పట్ల నరులకు కలిగే అసూయకు సంబంధించి చర్చిస్తే, భక్తులను అడగవలసిన మొట్టమొదటి ప్రశ్న ఏమిటంటే నీ కళ్ళతో స్పష్టంగా చూస్తున్న వర్తమాన నరావతారము నీ దృష్టిలో పరిపూర్ణమైన దత్తభగవానుడా? కాదా? ఒకవేళ

నరావతారునిలో 100% దత్తుడు సంపూర్ణంగా విలీనమైనాడని నీవు భావిస్తే, ఇక పరమాత్మ ఉత్తమ గుణాలను చూసి నీవు అసూయ చెందటం ఎందుకు? సంపూర్ణంగా ఆ ఉత్తమ గుణాలన్నీ దత్తభగవానునునివే కదా! ఈ సందర్భంలో బంగారము - రాగి పోలిక సరిపడదు, ఎందుకంటే బంగారం (స్వచ్ఛమైన నరుడు), రాగి (దత్తభగవానుడు) అను రెండు విభిన్న అంశములు కావు. దత్త భగవానుడు మరియు స్వచ్ఛమైన నరశరీరి సంపూర్ణంగా విలీనమై ఒకటే అంశమైన దత్త భగవానుడుగా మారుతున్నాడు. అయితే విలీనం చెందు విధానం పూర్తిగా మానవులు ఊహించలేనిది, ఎందుకంటే విలీనం చెందుతున్నవారిలో ఒకరు (దత్తుడు, భగవంతుడు) అనూహ్యమైన అంశం కాగా రెండవది (స్వచ్ఛమైన నరశరీరి) ఊహింపదగినది. ఈ ఊహించదగిన జగత్తులో సృష్టించబడినవన్నీ ఊహించదగిన అంశములే అయినందున ఈ ప్రక్రియను వివరించగల ఉదాహరణకు ఉపమానము ఎక్కడా కనిపించదు. బంగారం-రాగి ఉదాహరణలో పోల్చబడిన రెండు అంశములు ఊహించ దగినవే (సృష్టి లోనివే). ఒకవేళ రాగి, బంగారం సంపూర్ణంగా విలీనమై స్వచ్ఛమైన బంగారంగా కనిపిస్తున్నది అందామా, అంటే శక్తివంతమైన మైక్రోస్కోప్ ద్వారా పరిశీలిస్తే బంగారం, రాగి అనే రెండు రకాల లోహపుటణవులు వేర్వేరుగా కనిపిస్తాయి. కావున ఊహించదగిన బంగారం-రాగి వంటి ఉదాహరణ అనూహ్య పరబ్రహ్మము యొక్క పనితీరును సూచించు కచ్చితమైన ఉపమానము(పోలిక) కాజాలదు.]

షణ్ణాం తు మదమాత్సర్యే, శీర్షే దుర్ముఖ విద్విషామ్ |
యాభ్యా మన్యోన్య సిద్ధాంత–వివిధా మునయోఽప్యహో ||8.13||

[చెడుకోణములలో చూపబడి చెడుస్వభావాలుగా ముద్రింపబడిన ఆరు స్వభావములు, జీవాత్మలకు ఆరుగురు శత్రువులైన అరిషడ్వర్గములు. కామము (శృంగారము), క్రోధము (అనైతిక కోపము), లోభము (కూడబెట్టిన సంపద), మోహము (ఆకర్షణ), మదము (మితిమీరిన అహంకారం), మాత్సర్యము (అసూయ) అనే ఆరింటిలో, చివరి రెండు స్వభావములైన అసూయాహంకారములు రారాజులు. ఇవి ఎంతగా ప్రభావితము చేస్తాయి అంటే, వీని బారిన పడి స్వయంగా ఋషులే వారి వారి సిద్ధాంత నిరూపణలు చేయు సందర్భాలలో పరస్పరము గొడవలు పడ్డారు.]

తైజసాన్ భజతే దీర్ఘ-తపసా స్వల్ప జీవితే |
దత్తో నరావతీర్ణోఽతః, సులభో జ్ఞాన బోధకః ||8.14||

[తేజోరూపంలోని భగవంతుని దర్శించడానికి భక్తులు ఎంతో తపస్సు చేస్తారు. ఎంతో కాలాన్ని తపస్సు కోసం వెచ్చిస్తారు. ఈ విధంగా చాలా చిన్నదైన మానవ జీవితకాలంలో ఎక్కువ కాలం తపస్సుకై వ్యర్థమవుతుంది. కాలాన్ని ఇలా వ్యర్థం చేయకుండా, ఏ తేజోరూప అవతారము కొరకు భక్తులు ఇంతగా తపస్సు చేశారో, ఆ తేజోరూపాన్నే సృష్టించిన వాడు స్వయంగా భూమి మీదకు వచ్చి, జీవాత్మలతో సులువుగా కలిసిపోయి వారికి కావలసిన స్పష్టమైన ఆధ్యాత్మిక జ్ఞానం పంచగల నరావతారముగా అవతరిస్తాడు.]

అభాగ్యాత్ సమ విక్షేపాత్, స త్యక్తోఽపి విభూతిమాన్ |

ద్వైత్యవాదేన తద్భోధం, తిరస్కు ర్వంతి తద్వశాః ||8.15||

[కాని మానవులకు ఉన్న అహంకార పూరిత ఈర్ష్య అనే దురదృష్టము కారణంగా తమలాగే మానవశరీరంలో నున్న వర్తమాన నరావతారమైన భగవంతుని చూసి తమలాంటి నరుడేననే సజాతి భావన వలన వికర్షిస్తారు. అవతారపురుషుడు అద్భుతమైన మహిమలను ప్రదర్శించినప్పటికీ అదే అహంకారము మరియు అసూయల ప్రభావము చేత వాటిని నిరాకరిస్తారు. మహిమలు రాక్షసులు కూడా చేయగలరని వాదించి వాటి యొక్క స్థాయిని తగ్గిస్తారు. దీనిని ఆధారంగా చేసుకుని జనులు నరావతారము యొక్క స్థాయిని తగ్గించి చూస్తూ, నరావతారము బదులు ఇతడు చిన్న రాక్షసుడేమో అని సంశయిస్తారు. ఒకవేళ అద్భుతమైన ఆధ్యాత్మిక జ్ఞానమును నరావతారము బోధించినా కూడా జనులు అదే అహంకారము మరియు అసూయల ప్రభావం చేత ఆ జ్ఞానాన్ని ఆక్షేపిస్తూ, నరావతారంలో వచ్చిన భగవంతుని లెక్కచేయరు.]

రాజ్ఞా సామాన్య వస్త్రాంగాత్, దాస శ్చీచీనాంబరో వరః |
కృష్ణేంద్రావివ తత్రాఽత్ర, నృణాం దేవస్య హి చ్యుతిః ||8.16||

[రాజు ఒకవేళ సాధారణమైన నూలు వస్త్రం ధరించి ఉంటే జనులు అతనిని అంతగా గౌరవింపరు. కాని ఒకవేళ బంటు పట్టు వస్త్రములు ధరించి వచ్చినా జనులు అతనిని రాజు కన్నా ఎక్కువగా గౌరవిస్తారు. అలాగే దత్త భగవానుడు శ్రీకృష్ణుని శరీరంలో వచ్చినపుడు అప్పటి జనులు తమలాంటి మానవ శరీరమే కలిగి ఉన్నాడని తలచి గౌరవించలేకపోయారు. బృందావనం గ్రామస్థులు శ్రీకృష్ణుని పూజింపక, తేజోరూప శరీరంలో ఉన్న ఇంద్రుడికి ఎక్కువ ప్రాముఖ్యత నిచ్చి పూజించారు. కావున అంతర్లీనమై ఉన్న భగవంతుడు గౌరవింపబడక పోవడానికి కారణం, చవకైన బాహ్య రూపం (మానవశరీరం). ఇంద్రుడు ఆ భగవంతునికి సేవకుడే అయినప్పటికీ తన బాహ్య రూపం (తేజోరూప శరీరం) విలువైనది కావటంతో జనుల చేత ఎక్కువ ప్రాముఖ్యత పొంది పూజింపబడినాడు. దీనికి కారణం సారూప్య మాధ్యమముల మధ్య కలిగిన వికర్షణ. శ్రీకృష్ణుని రూపం కూడా బృందావన వాసుల వలె మానవ శరీరం కావడం కారణము. అదే గ్రామస్థులకు తమ శరీరం కంటే భిన్నమైనట్టి (తేజోరూపం) ఇంద్రుని విషయంలో ఇలాంటి వికర్షణ కలగలేదు. ఈ క్రమంలో మానవులు భూమి మీద అవతరించిన వర్తమాన నరావతారమును శరీర సామ్య వికర్షణ కారణంగా తిరస్కరిస్తారు, వారు తమ శరీరం విడిచిన తర్వాత వెళ్ళిన ఊర్ధ్వ లోకాలలో తేజోరూప శరీరం ధరించినపుడు అక్కడ తేజోరూప ధారి అయిన భగవంతుని చూసి కూడా మునుపటి శరీర సామ్య వికర్షణ కారణంగానే తిరస్కరిస్తారు. ఈ విధంగా జీవాత్మ భూమి మీద నర శరీరంలో జీవించినపుడు ఇక్కడ, తేజోరూప శరీరంలో ఉన్నపుడు అక్కడ, శాశ్వతంగా వర్తమాన నరావతార-తైజసావతారములను పొందలేక నష్టపోతారు. ఈ విధంగా జీవుడు ఎప్పటికీ భగవంతుని పట్టుకోలేక పొందెడి శాశ్వతనష్టమును గురించి వేదాలు ఘోషించినవి (**మహతీ వినష్టిః..**).]

ఉపాధిగుణ మస్పృశ్య, దత్తోఽస్తి దత్త నిర్ణయః |
నిర్లక్ష్యం తేన తత్తాభ్యాం, దివ్యత్వం భావయంతి నో ||8.17||

[దత్త భగవానుడు మానవ శరీరంతో విలీనమై నరావతారమై వచ్చిన సందర్భంలో భగవానుడగు దత్తుడు తన మాధ్యమంగా ఉన్న మానవ స్వభావము విషయంలో జోక్యము చేసుకోడు. ఎందుకంటే సహజ స్వభావంతో మానవ శరీర మాధ్యమము, తన చుట్టూ ఉన్న మానవులతో సులువుగా కలిసిపోతే వారు ఎలాంటి ఉద్విగ్నత లేకుండ తమకున్న ఆధ్యాత్మిక సంశయాలను నరావతారమును అడిగి తెలుసుకోగలరు. ఎప్పుడైతే నరావతారము యొక్క శరీర మాధ్యమం, సహజ మానవ లక్షణాలు అంటే పుట్టడం, భోజనం చేయడం, నీళ్ళు తాగడం, రోగాలు రావడం, శృంగారం, నిద్ర, మరణం లాంటి స్వభావాలన్నీ ప్రదర్శిస్తుందో అప్పుడు చుట్టు ఉన్న మానవులు అవతారపురుషుని పట్ల పూర్తి నిర్లక్ష్యవైఖరి పెంపొందించుకుంటారు. అంతేకాదు, నరావతారము యొక్క దివ్యత్వమును అంగీకరింపక విపరీతధోరణి అలవర్చు కుంటారు. ఈ ధోరణికి కారణము అహంకార పూరితమైన అసూయ.]

విభూతిరూపయుక్తా చేత్, దేవాః క్షుద్రో మతో న హి |
కంచిత్ కాలం నిగూఢా తౌ, వ్యక్తౌ స్వార్థే నిరాకృతే ||8.18||

[నరావతారము ప్రదర్శించే అద్భుతమైన మహిమలను చూసి జనుల హృదయాలలో అహంకారభరిత అసూయ పుట్టడం మానవ సహజ స్వభావము. అదే సమయంలో మరొక ఆలోచనగా, వారి కఠినమైన ప్రాపంచిక సమస్యల నుండి పరిష్కారము పొందడంలో ఈ మహిమలను ఉపయోగించు కోవచ్చనే విశ్వాసము కూడా వారిలో చిగురిస్తుంది. కాని భగవంతుని ఉనికిని చాటడానికి మాత్రమే అద్భుతమైన మహిమలు చేయబడతాయని, భక్తుల ప్రాపంచిక సమస్యల పరిష్కారము కొరకు చేయబడవని తెలుసుకొని వారు మహిమలను కూడా నిర్లక్ష్యపరుస్తూ, నరావతారమును ఒక చిన్నరాక్షస స్వభావం కలిగిన రూపము అని, ఏవో చిన్న చిన్న మహిమలు చేస్తుంటాడు! అని భావిస్తూ ఉంటారు. కాకపోతే వాళ్ళ హృదయాలలో దాగి ఉన్న అసూయ, అహంకారాలు రెండూ భవిష్యత్తులో కొంత కాలము తర్వాతైనా ఇట్టి మహిమలను వాడుకోగల చక్కటి అవకాశం వస్తుందేమోనని ఎదురు చూస్తుంటాయి. ఎప్పటికీ ఆ అవకాశం రాకపోతే, తమ స్వార్థ ప్రయోజనాలు తీరకపోతే మాత్రము ఈ రెండు (అసూయ, అహంకారములు) బహిర్గతము అవుతాయి.]

ప్రవృత్తౌ వా నివృత్తౌ వా, దుఃఖాయాఘ ప్రచోదకౌ |
దుర్ముఖౌ పరిహర్తవ్యౌ, సన్ముఖావుపయోగినౌ ||8.19||

[ప్రాపంచిక జీవితంలోనైనా, ఆధ్యాత్మిక జీవితంలోనైనా అసూయ, అహంకారములు చివరికి దుఃఖాన్ని ఫలితంగా ఇచ్చే పాపకర్మలు చేయుటకు జీవాత్మలను ప్రేరేపిస్తాయి. చెడుకోణములో బయలుదేరినపుడు మాత్రము ఈ రెండు గుణాలను తప్పక నివారించాలి. ఒకవేళ అసూయ, అహంకారములు మంచికోణములో చూపబడితే తప్పక వాటిని సద్వినియోగ పరచుకోవాలి.]

అహంతయా దశగ్రీవో, మాత్సర్యేన సుయోధనః |

నృభక్తో ద్విగుణం తాభ్యాం, నష్టో జాగ్రత జాగ్రత ||8.20||

[అహంకారము చేత రాక్షసుడైన రావణుడు నష్టపోయాడు, అసూయ చేత దుర్యోధనుడు నష్టపోయాడు. మానవభక్తులు రెండింటిచేత రెండు రెట్లు నష్టపోతారు. ఈ రెండు స్వభావములు అసూయ మరియు అహంకారములు. (మానవ భక్తులు భూమి మీద జీవించినపుడు అవతరించిన వర్తమాన నరావతారమును గుర్తించలేక, మరణానంతరం శరీరం విడిచిన తర్వాత ఊర్ధ్వ లోకాలలో ప్రవేశించి, తేజోరూప శరీరం ధరించినపుడు అక్కడ తేజోరూప ధారిగా వచ్చిన భగవంతుని చూసి కూడా మునుపటి అసూయ మరియు అహంకారముల కారణంగానే తిరస్కరిస్తారు). కావున భక్తులారా! చెడుముఖాలతో వచ్చిన అసూయతో, అహంకారముతో జాగ్రత్త! జాగ్రత్త!]

ఇతి త్రైలోక్యగీతాయాం 'మదమాత్సర్య జ్ఞాన యోగో' నామ అష్టమాధ్యాయః |

ఈ విధంగా త్రైలోక్యగీత యందు మదమాత్సర్య జ్ఞాన యోగము అనెడి అష్టమాధ్యాయము పరిసమాప్తము.